క్లుప్తంగా

నేడు బసవేశ్వరుడి రథోత్సవం



విద్యుత్ దీపాలంకరణలో బండే బసవేశ్వరస్వామి ఆలయం

నందవరం: మండల పరిధిలోని పూలచింత గ్రామంలో నేడు బసవ జయంతి పురస్కరించుకుని బండే బసవేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ పూజర్లు, భక్త బృందం సభ్యులు తెలిపారు. శనివారం గ్రామంలోని బసవేశ్వర ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకాలు, ఆకు పూజ గావించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు గావించి సాయంత్రం నందికోళ్ల సేవ, పల్లకీసేవ నిర్వహించి రథోత్సవం చేపట్టనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే స్వామి వారి సన్నిధిలో రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భక్త బృందం సభ్యులు తెలిపారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

తుగ్గలి: రైతు భరోసా పథకానికి అర్హత ఉన్న రైతులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ శనివారం తెలిపారు. ప్రభుత్వం రైతు పోర్టల్‌ను ఓపెన్ చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా పథకం ద్వారా లబ్ధిపొందని రైతులు, కొత్తగా పాసుపుస్తకం చేయించుకుని అర్హత ఉన్న వారు ఎవరైనా ఉంటే జిరాక్స్ పత్రాలు ఆర్‌బీకేకు తీసుకెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న దృశ్యం

మద్దికెర: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో దళారులు లేకుండా నేరుగా అర్హుల ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని ఇరిగేషన్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సచివాలయ మండల కన్వీనర్ కవిదాసు అన్నారు. శనివారం మద్దికెర, పెరవలి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు గురించి తెలియజేశారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

వెల్దుర్తి/కృష్ణగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో ఐదవ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్దుర్తి, కంబాలపాడు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు లక్ష్మీప్రసూన, అరుణ కుమారి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదవ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్, ఆధార్‌కార్డుతో అర గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి: విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా అల్లుగుండు, చెరుకులపాడు, వెల్దుర్తి ఫీడర్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అల్లుగుండు, బొమ్మిరెడ్డిపల్లె, మల్లెపల్లె, నార్లాపురం గ్రామాలతోపాటు చెరుకులపాడు ఫీడర్ పరిధిలోని గ్రామాలకు, చెరుకులపాడు రహదారి నుంచి నార్లాపురం వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 6 గంటల వరకు ఉంటుందన్నారు. గృహ వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, రైతులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన రంగనాయకులు

కోడుమూరు: మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన రంగనాయకులు (36) అనే వ్యక్తి శనివారం రాత్రి రామాపురం బస్ స్టేజీ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. రంగనాయకులు వెల్దుర్తికి బైక్‌పై వెళ్లి అల్లినగరం గ్రామానికి వస్తుండగా ఏదైనా వాహనం తగిలి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడా? లేక ఎవరైనా గిట్టనివారు హత్య చేశారా? అనే కోణంలో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించడంతో పాటు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రంగనాయకులుకు భార్య మంజులతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.





ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, నాగలదిన్నెలో ముస్లింలకు రంజాన్ సందేశమిస్తున్న మత గురువు, ఎమ్మిగనూరులో ముస్లింలనుద్దేశించి మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

ఎమ్మిగనూరు టౌన్/నందవరం/గోనెగండ్ల: రంజాన్ వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం సాయంత్రం నెలవంక కనిపించగానే ఉపవాస దీక్షలు విరమించి శనివారం పర్వదినాన్ని కుటుంబీకులతో ఆనందంగా చేసుకున్నారు. ఉదయాన్నే ఈద్గాలు, మసీదులకు చేరుకుని ప్రత్యేక నమాజులు చేశారు. పేద ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కొత్త దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో అల్లాహ్‌ను ప్రార్థించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని కమిటీ రోడ్డులో ఉన్న ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో మతగురువు మహమ్మద్‌బాషా సాహెబ్ ఖాద్రీ ఈద్-ఉల్-ఫితర్ విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంతమేర దాన ధర్మాలు చేయాలని, మహమ్మద్ ప్రవక్త స్మరణతోపాటు ఆయన మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ కాలనీలోని 40 సెంట్ల స్థలాన్ని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఈద్గా కోసం కేటాయించారని, ఇందుకు



ఎమ్మిగనూరులో దువా చేస్తున్న మత పెద్ద



ఎమ్మిగనూరు ఈద్గాలో ప్రత్యేక నమాజులో పాల్గొన్న ముస్లింలు

ఎలాంటి ఇబ్బందుల్లేవని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ తిక్కారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డిలు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, జామియా మసీదు కమిటీ అధ్యక్షులు ఖాశింబేగ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బుట్టా రంగయ్య, వీరేంద్ర, సునీల్‌లు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

- నందవరం మండంలోని నందవరం, నదికైరవాడి, హాలహార్వి, నాగలదిన్నె, ముగతి, కనకవీడు, టి.సోమలగూడూరు, పోనకలదిన్నె తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ, మండల సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి ముస్లింలకు శుభాంకాంక్షలు తెలిపారు.
- గోనెగండ్లతో పాటు హెచ్.కైరవాడి, పెద్ద నేలటూర్, పెద్ద మరివీడు, గంజిహళ్లి, బైలుప్పల, వేముగోడు తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు



గోనెగండ్ల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఎంపీపీ టి.నసురుద్దీన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, కోఆప్షన్ మాజీ మెంబర్ బందె నవాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఆలూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జయరాం



చిప్పగిరిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎల్లార్తిలో ముస్లింలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా రంజాన్ పండుగ

ఆలూరు/ఆస్పరి/హొళగుంద/చిప్పగిరి: యోజకవర్గ వ్యాప్తంగా శనివారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయమే మసీదులు, ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత గురువులు రంజాన్ విశిష్టతను ముస్లింలకు తెలియజేశారు. మంత్రి గుమ్మనూరు జయరాం, దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, ఎంపీపీ రంగమ్మ, సింగిల్ విండో చైర్ పర్సన్ హనుమంతమ్మ తదితరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



హొళగుందలో ఈద్గాకు తరలి వస్తున్న ముస్లింలు



ఆస్పరిలో ఈద్గాకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు



వెల్దుర్తి ఈద్గాలో పండుగ నమాజులో పాల్గొన్న ముస్లింలు



టి.గోకులపాడు గ్రామంలో నమాజులో పాల్గొన్న ముస్లింలు

పత్తికొండ నియోజకవర్గంలో..

తుగ్గలి/వెల్దుర్తి/మద్దికెర/కృష్ణగిరి: పత్తికొండ నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు శనివారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారు జామునే స్నానాలాచరించి కొత్త దుస్తులు ధరించి ఈద్గాలు, మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ విశిష్టతను మత పెద్దలు వివరించారు.



వెల్దుర్తి ఈద్గాలో ఈద్‌ముబారక్ తెలుపుకుంటున్న చిన్నారులు



మద్దికెరలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న యాదవరాజు



రామాపురం కొట్టాల ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మే 31న ఢిల్లీలో వాల్మీకుల సంకల్ప దీక్ష

పత్తికొండ రూరల్/ఆలూరు: మే 31న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వాల్మీకుల సంకల్ప దీక్షకు పెద్ద ఎత్తున వాల్మీకులు తరలిరావాలని వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ కోరారు. శనివారం పత్తికొండ పట్టణం, దేవనకొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో సంకల్ప దీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ గత మార్చి 24న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేయడం సంతోషకమరన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్టీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఢిల్లీలో సంకల్ప దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. పత్తికొండ సమావేశంలో



కరపత్రాలు విడుదల చేస్తున్న సుభాష్‌చంద్రబోస్, వాల్మీకులు

వీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆస్పరి నరేంద్ర, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు శివశంకర్‌నాయుడు, సుధాకర్, శ్రీను, జయరాముడు, వెంకటేశ్వర్లు, బాలు, దేవనకొండ సమావేశంలో వీఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున, వాల్మీకి సంఘం నాయకులు రాజన్న, రాముడు, రాజు, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి గుమ్మనూరు జయరాంను సన్మానించిన బల్లూరు గ్రామస్తులు

ఆలూరు: హాలహర్వి మండలం బల్లూరు గ్రామంలో నిర్వహించనున్న బల్లూరు ఈశ్వరయ్య ఉత్సవాలకు మంత్రి గుమ్మనూరు జయరాంను గ్రామస్తులు ఆహ్వానించారు. శనివారం గ్రామస్తులు శివస్వామి వడియార్, కరిలింగప్ప, సర్పంచ్ మారెన్న, ఎంపీటీసీ సభ్యుడు గాదిలింగప్ప తదితరులు మంత్రి స్వగృహానికి చేరుకుని ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా విన్నవించారు. ఉత్సవాల సందర్భంగా 200 మంది పేద జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నామని, సహకారం అందించాలని కోరారు. తాగునీరు, విద్యుత్, అగ్నిమాపక విపత్తుల నిర్వహణ కేంద్రం అధికారులు సహకారం అందించేలా చూడాలని కోరారు. అనంతరం మంత్రి జయరాంను సన్మానించారు.

నేడు బసవ జయంతి ఉత్సవం

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని తేరు బజారులో వెలసిన శ్రీబసవేశ్వరుడి ఆలయంలో ఆదివారం స్వామి వారి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్థానిక ఒకటవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప శనివారం తెలిపారు. స్వామి వారికి ఉదయం అభిషేకం, ఆకు పూజ చేసి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. భక్తులు స్వామి వారి పూజలో పాల్గొని అన్నప్రసాదం పొందాలని సూచించారు.

జనావాసాల్లోకి జింక

ప్యాపిలి: అడవి నుంచి దారి తప్పిన ఓ జింక శనివారం జనావాసాల్లోకి వచ్చింది. పట్టణ సమీపంలోని గుడిపాడు రహదారి మీదుగా కుమ్మరి వీధిలోకి ప్రవేశించిన జింకను స్థానికులు గమనించారు. అయితే అప్పటికే అది కుక్క కాటుకు గురై ఉండటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జింకకు ప్రథమ చికిత్స నిర్వహించిన స్థానికులు అటవీశాఖ అధికారుల సూచనల మేరకు అడవిలోకి వదిలేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకృష్ణ (22) మృతి చెందాడు. ప్యాపిలికి చెందిన వెంకటేశ్, సుంకురత్నమ్మల కుమారుడు శివకృష్ణ బంధువు హరికృష్ణతో కలసి ద్విచక్రవాహనంపై గుత్తికి వెళ్లాడు. తిరిగు ప్రయాణంలో పోతుదొడ్డి వద్దకు రాగానే కేఏ 07 బి 3786 నంబర్ లారీ మామిడికాయల మార్కెట్ నుంచి రోడ్డుపైకి వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో శివకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా హరికృష్ణకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హరికృష్ణను ఆసుపత్రికి తరలించారు.

మద్దిలేటయ్య క్షేత్రంలో భక్తుల సందడి



నరసింహస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తుల సందడి నెలకొంది. ఉభయ కర్నూ లు జిల్లాతో పాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసి పోయింది. వేకువజామున ఆల య పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కు లు చెల్లించుకున్నారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండా దీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.7,13,433 ఆదాయం వచ్చి నట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. డోన్ పట్టణానికి చెందిన గోపాల్‌రెడ్డి, శకుంతల దంపతులు స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,00,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, క్రిష్టారెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

శ్రీ మఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జిలు జస్టిస్ జోషి, జ్యోతి ములేమి శనివారం మంత్రాలయం వచ్చారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.



శ్రీ మఠంలో ప్రదక్షిణలు చేస్తున్న జడ్జి జస్టిస్ జోషి

రైతన్నకు వర్షం దెబ్బ



వెల్దుర్తి మండలం సిద్ధనగట్టు సమీపంలోని తోటలో నేల రాలిన మామిడి కాయలు

వెల్దుర్తి: వర్షం రైతన్నను ఆర్థికంగా దెబ్బ తీసింది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారు జాము వరకు ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానకు సిద్ధనగట్టు, లింగాల పల్లె గ్రామాల పరిధిలోని బొప్పాయి తోటలు నేలకొరిగాయి. ఈదురుగాలులకు 50 ఎకరాల్లోని మామిడి పంటకు నష్టం చేకూరింది. దిగుబడులు చేతికొచ్చే దశలో కాయలు నేల రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

తడిసిన ధాన్యం

నందవరం: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, నందవరం, గురజాల, రాయచోటి, కనకవీడు తదితర గ్రామాలో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. చేతికివచ్చిన పంట దిగుబడులు తడిసిపోయాయి. నూర్పిళ్లు, కోతలు చేసుకుని కల్లాల్లో ఆరబోసుకున్న మిర్చి, మొక్కజొన్న, వరి ధాన్యం వర్షార్పణం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నాగలదిన్నెలో వర్షానికి తడిసిన వరి ధాన్యం



తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకున్న రైతన్నలు



జోహరాపురంలో వర్షానికి తడిసిన ఎండు మిర్చి